క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామాగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకు వెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాల తయారీపై శిక్షణ



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ విజయ్‌ప్రసాద్

పద్మనాభం: నాణ్యమైన విత్తనాలు తయారు చేయడమే విత్తనోత్పత్తి పథకం ధ్యేయమని భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ్ ప్రసాద్ అన్నారు. విత్తనోత్పత్తి పథకంలో భాగంగా మండలంలోని కృష్ణాపురం, పొట్నూరు గ్రామాల్లో రైతులకు శుక్రవారం నాణ్యమైన విత్తనాలు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో రైతులకు బీపీటీ 5204 రకం విత్తనాలు 60 బస్తాలు ఇచ్చామన్నారు. రైతులు ఈ విత్తనాలతో పంట పండించి వచ్చే సంవత్సరానికి ఈ గ్రామాల్లోని మిగతా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తారని చెప్పారు. జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్.సుబ్రమణ్యం, అసిస్టెంట్ డైరెక్టర్ జి.హరికృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు సి.హెచ్.సురేష్, ఎంపీఎస్ చలం పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో విశేష పూజలు



విశేష అలంకరణలో చంద్రంపాలెం దుర్గాలమ్మ

మధురవాడ: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని దుర్గాలమ్మకు విశేష పూజలు చేశారు. చంద్రంపాలెం జాతర గట్టుపై వెలసిన పంచముఖ ఆంజనేయ స్వామి, షిర్డీ సాయినాథ సహిత దుర్గాలమ్మ వారి ఆలయంలో వరలక్ష్మీ పూజలు చేశారు. అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి, ప్రత్యేక కుంకుమ, పుష్పార్చనలు చేశారు. పరిసర ప్రాంతాల మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చంద్రంపాలేనికి చెందిన వాండ్రాసి ఎల్లాజీ, మంగ, రాజమండ్రి సిల్క్ షాపు మధుసూదన్, అన్నపూర్ణ దంపతుల సహాయ సహకారాలతో అమ్మవారికి పులిహోర, శనగలు ఇతర ప్రసాదాలు సమర్పించి, భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

హుండీ సొమ్ము కాజేశారని ఫిర్యాదు

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్ ప్రాంతానికి చెందిన భూలోకమాత ఆలయం హుండీ తాళాలను బద్దలు కొట్టి సుమారు రూ.30 వేలు కాజేశారని ఆరోపిస్తూ ఇక్కడి కాలనీవాసులు శుక్రవారం ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్న సమయంలో హుండీ బద్దలు కొట్టి డబ్బులు తీసి, కొత్త తాళాలు వేసినట్టు కొందరు అనుమానితుల పేర్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల స్థానికులలో రెండు వర్గాల మధ్య తగాదాల కారణంగా ఒకవర్గం వారు బోరుబావికి తాళాలు కూడా వేసినట్టు తెలిసింది. హుండీ పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాలుష్య కోరల్లో గ్రామాలు



నురగలు కక్కుతున్న కలుషిత నీరు

- సీ ఫుడ్ కంపెనీ వ్యర్థాలతో పచ్చదనం కనుమరుగు
- చెరువుల్లో నీరు కలుషితం
- తాగునీటికి అవస్థలు
- వ్యాధుల బారిన గ్రామస్తులు



పంటపొలాల్లోకి చేరుతున్న కలుషిత నీరు

కనుచూపు మేర పచ్చదనంతో పుడమి తల్లి పచ్చని చీర కట్టిందా అన్నట్టు కనువిందు చేసే దృశ్యం కనుమరుగై పోతోంది. భూమాత విష రసాయనాలకు బలైపోతుండగా.. 15 వేల జనాభా వ్యాధుల భారిన పడుతున్నారు. మూగజీవులు కలుషిత జలాల బారిన పడుతున్నాయి. పది గ్రామాల ప్రజలను వేధిస్తున్న సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు మౌనం వహించడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొమ్మాది: జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలో రెండు రొయ్యపిల్లల కేంద్రాల (సీ ఫుడ్ కంపెనీల) నుంచి విడుదలవుతున్న విష రసాయనాలు పంటలను నాశనం చేస్తున్నాయి. కంపెనీ వ్యర్థాలను ఫిల్టర్ చేయకుండా నేరుగా వదిలేయడంతో ఆ కలుషిత నీరు గెడ్డలను దాటి పొలాల్లోకి చేరి నాశనం చేస్తోంది. దీనివలన పొలాలు దిగుబడి తగ్గడంతో పాటు, పంటల నాణ్యత లోపిస్తోంది. ఇక్కడ పండించిన పంటలను కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 4వ వార్డు పరిధి కాపులుప్పాడ, సోమన్నపాలెం, రెడ్డీలపాలెం, కె.నగరపాలెం ప్రాంతాల రైతులను ఈ సమస్య ఏళ్ల తరబడి వేధిస్తోంది.

కలుషితమైన రాజుగారి చెరువు



మత్స్యసంపదకూ ముప్పు

గతంలో ఈ గ్రామాల్లో ఈ చెరువుల నీటితోనే పంట పొలాలను సాగు చేసేవారు. ఈ ప్రాంతాల్లో సుమారు 90 ఎకరాల భూమిలో రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ కలుషిత నీరు చెరువుల నుండి నేరుగా పొలాల్లోకి చేరడంతో వ్యవసాయం దిగుబడి తగ్గిపోవడంతో వందలాది రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కలుషిత నీరు సముద్రంలో కూడా కలవడంతో చేపలుప్పాడ, మంగమారిపేట ప్రాంతాల్లో మత్స్య సంపద తగ్గుముఖం పడుతోందని ఇక్కడ మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు.

చెరువులు కలుషితం

సీ ఫుడ్ కంపెనీలు రసాయనాలు వాడిన వ్యర్థాలను, నీటిని నేరుగా కాల్వల్లో విడుదల చేయడంతో ఆ నీరు మారికవలస నుండి పాత పరదేశిపాలెం, బోయపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లోని కాలువల్లో కలసి, ఇక్కడి చెరువుల్లోకి చేరుతోంది. రాజుగారి చెరువు, కంబాల చెరువు, బాడవ చెరువు, గోస్తని చెరువు (గంభీరం గెడ్డ)లలో ఈ రసాయనాలు కలవడంతో ఈ చెరువులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. పైగా తీవ్ర దుర్వాసన సెగలు కక్కుతోంది.

గ్రామాల్లో దుర్వాసన

కలుషిత నీరు కాల్వల్లో చేరడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని గ్రామస్తులు తెలిపారు. వీటి వలన చర్మవ్యాధులు వస్తున్నాయని చెబుతున్నారు. దోమలు, ఈగలు బాగా పెరిగిపోవడంతో రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు కంపెనీలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మారికవలస గ్రామస్తులు, తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పంట దిగుబడి తగ్గిపోతోంది



కలుషిత నీరు పొలాల్లోకి చేరి దిగుబడి తగ్గిపోయింది. ఇక్కడ పండిన పంట తినడానికి కూడా భయంగా ఉంటోంది. మూడు పంచాయతీల్లో సుమారు 90 ఎకరాల్లో రైతులందరం వ్యవసాయం చేసుకుంటున్నాం. నీరు లేక, ఉన్న చెరువులు కలుషితం కావడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నాం.

– నాగోతు సింగన్న, రైతు, కె.నగరపాలెం

రోగాల బారిన పడుతున్నాం



సీ ఫుడ్స్ కంపెనీలు వాడుతున్న రసాయనాల వలన అనేక మంది రోగాల బారిన పడుతున్నాం. ఈ రసాయనాలను గ్రామాల్లోని కాల్వల్లోకి విడుదల చేయడంతో దుర్గంధం భరించ లేకపోతున్నాం. తాగునీరు కూడా కలుషితమవుతోంది. ఇలాంటి కంపెనీలు నివాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి.

– వాండ్రాసి సన్యాసిరావు, కె.నగరపాలెం

దుర్గంధంతో ఉండలేకపోతున్నాం



కలుషిత నీరు నేరుగా చెరువుల్లోకి రావడంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ దుర్వాసనతో నిండిపోతున్నాయి. ఎక్కువమందికి శ్వాసకోశ వ్యాధులు కూడా వస్తున్నాయి. తాగునీటిలో కెమికల్స్ కలవడం వల్ల చర్మవ్యాధులు, దద్దుర్లతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులతో కమిటీ వేసి పరిష్కార మార్గం చూపకపోతే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఎదుర్కోవాలి.

–వాడ నాయుడు, రెడ్డిలపాలెం.

కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తాం



కలుషిత నీటివలన 10 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నాం. ప్రజల పొలాలకు నష్టం వస్తున్నా అధికారులు స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. దీనిపై ఓ నివేదిక తయారు చేసి స్థానికుల సంతకాలు సేకరించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం.

– దౌళపల్లి కొండబాబు, 4వ వార్డు కార్పొరేటర్

మొక్కలు నాటి సంరక్షించాలి



తాటితూరు జెడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు



బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

తగరపువలస: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలు తీసుకోవాలని భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు కోరారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ బుడుమూరి సోమేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి ప్రసాదరావు, ఉపాధ్యాయులు టి.ఎస్.వి.ప్రసాదరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలలో స్కూల్‌లో కమిటీ చైర్మన్ షేక్ షర్మిల, ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.
- రేఖవానిపాలెం పంచాయతీలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మల్లేటి హరి శంకర్ మొక్కలు నాటారు. పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘టీటీడీ ఈ-దర్శన్’ పునఃప్రారంభానికి వినతి

తగరపువలస: తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శనం, ఆర్జిత సేవా టిక్కెట్లు, వసతి గదుల బుకింగ్ మూడు నెలల ముందుగా ఆన్‌లైన్‌లో కేటాయించడంతో సామాన్య భక్తులు ఇబ్బంది పడుతున్నారని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న పేర్కొన్నారు. ఈ మేరకు టీటీడీ ఈవోకు ఆన్‌లైన్‌లో వినతిపత్రం పంపించారు. గతంలో ఈ-దర్శన్ కేంద్రాల ద్వారా ఆఫ్‌లైన్ విధానంలో దర్శనం, సేవా టిక్కెట్లు, వసతి గదులు సులభంగా పొందేవారని, ఐదేళ్లుగా వీటిని మూసివేయడం వలన చాలామంది భక్తులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. టీటీడీ అధికార వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా టిక్కెట్లు స్వయంగా బుక్ చేసుకోలేని భక్తులు బయట ఇంటర్నెట్ కేంద్రాలను ఆశ్రయించి అధికమొత్తంలో డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దివ్యాంగులు, వృద్ధుల టిక్కెట్లు కూడా ఆన్‌లైన్‌లో కేటాయించడం వలన కొండపై నేరుగా దర్శనం పొందలేక గంటల తరబడి ఉచిత క్యూలైన్లలో వేచి ఉంటున్నారన్నారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం ఈ-దర్శన్ కేంద్రాలను పునఃప్రారంభించాలని కోరినట్టు తెలిపారు.

నీటి నిల్వలతో వ్యాధుల ముప్పు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎంవోహెచ్ కిషోర్

కొమ్మాది: వర్షాలు పడుతున్నందున విషజ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రతీ ఒక్కరు తమ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఏఎంవోహెచ్ డా.కిషోర్ సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఫ్రై డే- డ్రై డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తలను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించి, సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, మలేరియా విభాగం, శానిటేషన్ విభాగం ఇన్‌స్పెక్టర్లు మంగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

- 4వ వార్డు చేపలుప్పాడలో జీవీఎంసీ అధికారులు ఫ్రైడే - డ్రైడే నిర్వహించారు. విష జ్వరాలు ఎలా విజృంభిస్తాయో తెలుపుతూ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్లు పైడిరాజు, అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తగరపువలస: సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు సుష్మిత సూచించారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా బంగ్లామెట్టలో స్థానికులకు, విదార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. జ్వరాలు, వాంతులు, తలనొప్పి, వికారం, విరేచనాలు ఉన్నట్లయితే వైద్య, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం హేమలత, ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు

- కొత్తపేటలో నెలల తరబడి ఇదే సమస్య
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కొత్తపేటలో రహదారి పక్కన నాచు కట్టిన మురుగు



ఎర్రయ్యపాలెం బీచ్ రోడ్డుపై నిలిచిన మురుగునీరు



కొత్తపేటలో పూడుకుపోయిన డ్రైనేజీలు

తగరపువలస: అన్నవరం పంచాయతీ పరిధి కొత్తపేట గ్రామంలో రోడ్డుపైనే మురుగు పేరుకుపోతోంది. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో అక్కడికి వచ్చే సందర్శకులకూ మురుగునీరే స్వాగతం పలుకుతోంది.

భీమిలి-విశాఖ బీచ్‌రోడ్డు తరువాత మండలంలోని అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం సముద్రం వద్ద నిర్మించిన జెట్టీకి ఎక్కువ మంది పర్యాటకులు వస్తుంటారు. ఈ పంచాయతీలో తీరాన్ని ఆనుకుని అన్నవరంలో నిర్మించిన రిసార్ట్స్‌కు రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడికి అయిదు కిలోమీటర్ల దూరంలో తీరాన్ని ఆనుకుని ఉన్న ‘పాండవుల పంచ’ ప్రసిద్ధి చెందిన ప్రదేశం. అన్నవరంతో పాటు దీనిని ఆనుకుని భోగాపురం మండలంలో ఉన్న తూడెం, బసవపాలెం పంచాయతీలు కొబ్బరితోటలకు ప్రసిద్ధి. ఈ కొబ్బరితోటలు, తీరంలోని అందాలను తిలకించడానికి బయట ప్రాంతాల నుంచి నిత్యం ఎందరో అన్నవరం పంచాయతీకి వస్తుంటారు. వీరందరికి పంచాయతీ ప్రారంభంలో కొత్తపేట గ్రామంలో రహదారిపై నెలల తరబడి నిలిచిన మురుగునీరే స్వాగతం పలుకుతోంది.

వ్యాధులు ప్రబలుతున్నా ఇంతే..

ఒక పక్క విషజ్వరాలతో భీమిలి మండలంలోని పలు ప్రాంతాలు వణుకుతున్నా ఈ పంచాయతీలో అపరిశుభ్ర వాతారణం పంచాయతీ పాలకవర్గానికి, అధికారులకు, సచివాలయ సిబ్బందికి పట్టినట్టు లేదు. వీరంతా కూడా ఆ మురుగునీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. మరొకవైపు దివీస్ లేబొరేటరీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులతో పాటు పక్కరాష్ట్రాల కార్మికులు కొత్తపేటలోని తాత్కాలిక నివాసాలలోనే కాలం గడుపుతుంటారు. ఈ గ్రామంలో ఎక్కడ చూసినా డ్రైనేజీలు పూడుకుపోవడం, నాచుకట్టిన మురుగునీరే కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం పేరుకే పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా వాస్తవానికి ఇలాంటి చోట్ల ఎటువంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పూడుకుపోయిన డ్రైనేజీలను శుభ్రం చేసి రహదారులపై నిలిచిన మురుగునీటిని తొలగించాలని కోరుతున్నారు. పర్యాటక ప్రాంతంగా ఆకట్టుకుంటున్న అన్నవరం పంచాయతీని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని పంచాయతీ ప్రజలు, పర్యాటకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అసలే గుంతలు.. ఆపై వానలు



కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు ఇలా..



హైవే నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు ప్రారంభంలో నిలిచిపోయిన వర్షం నీరు

రాకపోకలకు స్థానికుల అవస్థలు

పీఎం పాలెం: గతుకులు పడ్డ రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ ఆరో వార్డు పీఎం పాలెం పరిధిలోని వివిధ కాలనీల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై ఏర్పడిన పెద్ద గుంతల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి గుంతలు పూడ్చి పరిస్థితి చక్కదిద్దాలని కోరుతున్నారు.

అదుపు తప్పారో.. అంతే..

- సగానికి శిథిలమైన డంపింగ్‌యార్డు రహదారి
- ఒరిగిపోతున్న వాహనాలు
- వాహనచోదకుల అవస్థలు



సగానికి తగ్గిపోయిన నమ్మివానిపేట డంపింగ్‌యార్డు బీటీ రోడ్డు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు నమ్మివానిపేట డంపింగ్ యార్డుకు వెళ్లే బీటీ రోడ్డు సగానికి శిథిలమైపోయింది. మరొక చోట రహదారి కోతకు గురయింది. ప్రతిరోజూ చిట్టివలస, తగరపువలస, సంగివలస డివిజన్ల నుంచి పదుల సంఖ్యలో క్లాప్ వాహనాలతో పాటు ట్రాక్టర్లు, వ్యాన్ల ద్వారా చెత్త సేకరణ జరిగి ఈ మార్గంలోనే డంపింగ్‌యార్డుకు చేరుతుంది. అసలే ఇరుకైన మార్గం.. ఆపై శిథిలం కావడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే అవకాశం లేకపోవడంతో పాటు బరువు కారణంగా, శిథిలమైన రహదారిలో ఒరిగిపోతున్నాయి. నమ్మివానిపేట నుంచి డంపింగ్‌యార్డు వరకు సుమారు 500 మీటర్ల మేర రహదారికి మరమ్మతులతో పాటు విస్తరణ చేపట్టాలి. అలాగే ఈ మార్గంలో ఇరువైపులా తుప్పలు పెరిగిపోయినందున వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని చెత్త తరలించే వాహనదారులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

సింహవల్లీ తాయారుకు లక్ష కుంకుమార్చన



కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారు, సువర్ణ అమ్మవారు



అమ్మవార్లకు హారతి అందిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

సింహాచలం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సింహగిరిపైనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వేంజేసిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో సింహాసనంపై సింహవల్లీ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి లక్ష కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులను ఆలయ ప్రాంగణంలో వేంజేపచేశారు. పది అవృతలతో లక్ష నామాలను పఠిస్తూ అమ్మవారికి అర్చకులు కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు కుంకుమ ప్రసాదం, శేషవస్త్రాన్ని అందించారు. సాయంత్రం అమ్మవార్లను పల్లకిలో అధిష్టింపజేసి ఆలయ బేడా తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. అనంతరం సహస్రనామార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, పారాయణదారులు, అర్చకుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

మంత్రి వెళ్లగానే ట్రాఫిక్ అస్తవ్యస్తం



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద స్తంభించిన ట్రాఫిక్

మధురవాడ: మంత్రి గారి రాకతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన అధికారులు ఆయన వెళ్లిపోగానే, పట్టించుకోకుండా వదిలేయడంతో అస్తవ్యస్తం అయిపోయింది. వివరాలివి.. శుక్రవారం మంత్రి లోకేష్ భీమిలి కస్తూర్బా విద్యాలయానికి, చంద్రంపాలెం పాఠశాలకు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ బాగానే నియంత్రించారు. అయితే, మంత్రి వెళ్లిపోయిన వెంటనే ఒక్కసారిగా గాలికి వదిలేశారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బ్రిడ్జి కింద ద్విచక్ర వాహనాలు మాత్రమే అని బోర్డు పెట్టినా, ఆటోలు మధురవాడ అప్ బ్రిడ్జి కిందకి వెళ్లిపోవడంతో మరింత ఇబ్బంది ఎదురైంది. దీంతో గంటల తరబడి వాహనచోదకులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ కష్టాలు తీరే మార్గం కనుచూపు మేరలో కనిపించేలా లేదని నిట్టూర్చారు.

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాఖ సిటీ : అకాల మరణం చెందిన హోంగార్డ్ మహ్మద్ హసమ్ కుటుంబానికి సీపీ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. హోంగార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.10 వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.10 వేలు మంజూరు చేశారు. హోంగార్డ్ భార్య జరీనా కౌశర్‌కు శుక్రవారం రూ.20 వేల చెక్కును అందజేశారు.